@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | మంగళవారం 13, ఫిబ్రవరి 2024 | పేజీలు: 04

# జీవో-46పై నిర్ణయం తీసుకోండి

## కొత్త నోటిఫికేషన్లపై అసెంబ్లీలో చర్చించాలని సీఎం నిర్ణయం

### హైపవర్ కమిటీతో సీఎం సమీక్ష





నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, ఫిబ్రవరి 12:

**ఎంపిక ప్రక్రియ పూర్తయిన** పోస్టుల విషయంలో ముందుకు సాగేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా జారీ చేసే నోటిఫికేషన్లలో జీవో నం.46 రద్దుపై పరిశీలన చేయాలని నిర్ణయించింది. పోలీస్ నియామకాల్లో జీవో నం.46 రద్దు సాధ్యాసాధ్యాలపై సీఎం రేవంత్ రెడ్డి సోమవారం తన నివాసంలో హైపవర్ కమిటీతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. మంత్రి శ్రీధర్ బాబు, ఏజీ సుదర్శన్ రెడ్డి, ఏఏజీ రంజిత్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, నియామక బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఇతర ముఖ్య అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. చట్టపరమైన అనేక అంశాలపై చర్చించారు. గతంలో నోటిఫికేషన్ జారీ చేసి, సెలక్షన్ ప్రాసెస్ పూర్తయిన పోస్టులతోపాటు, కొత్త నొటిఫికేషన్‌పై ముందుకెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. 2022 మార్చిలో పోలీస్ నోటిఫికేషన్ జారీ అయింది. 2023 అక్టోబరులో 15,750 పోస్టులకు సెలక్షన్ ప్రాసెస్ పూర్తయింది. కోర్టు కేసుల వల్ల నియామకాలు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. సెలక్షన్ ప్రాసెస్ పూర్తైన పోస్టులకు నియామక పత్రాలు అందించాలని హైకోర్టు ఇటీవల తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో సెలక్షన్ ప్రాసెస్ పూర్తైన 15,750 పోస్టులకు నియామక పత్రాలు అందించడం తప్ప వేరే మార్గం లేదని ఉన్నతాధికారులు సీఎంకు వివరించారు. కొత్తగా ఇచ్చే నోటిఫికేషన్లకు జీవో మిగతా 2లో..



## తెలంగాణలో నలుగురు ఐఏఎస్, 12 మంది ఐపీఎస్‌ల బదిలీ..

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, ఫిబ్రవరి 12:

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నలుగురు ఐఏఎస్, 12 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

▶ నిజామాబాద్ అదనపు కలెక్టర్ చిత్రమిశ్రాను ఐటీడీఏ ఏటునాగారం ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేశారు. ఐటీడీఏ ఏటునాగారం ప్రాజెక్టు అధికారి అంకిత్‌ను నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ చేశారు.

▶ ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాను ఉట్నూరు ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేశారు. ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చేతన్ మిగతా 2లో..



## నేడు నల్లగొండలో కేసీఆర్ సభ

- అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి జనంలోకి
- కృష్ణానది ప్రాజెక్టుల అప్పగింతపై సమరభేరి
- ఆరు నెలల్లోగా నీటివాటా తేల్చాలని కేంద్ర, రాష్ట్రాలపై ఒత్తిడి

▶ వివరాలు 02లో..



## కడలిలో కలిసేవే ఇచ్చాం

- కాంగ్రెస్ ఆరోపణలన్నీ అవాస్తవం.. అసెంబ్లీలో హరీశ్‌రావు వెల్లడి
- కృష్ణా జలాలపై మంత్రి ఉత్తమ్ మాటలన్నీ ఉత్తవే..
- మేం ప్రాజెక్టులను అప్పగించలేదు.. నీటి వాటాలకు ఒప్పుకోలేదు
- బోర్డుకు అప్పగించేందుకు సిద్ధమైనది కాంగ్రెస్ సర్కారే..
- నేను ప్రెస్‌మీట్ పెట్టి నిలదీశాక మాట మార్చారు
- నీళ్ల కోసం మీరు పోరాడండి.. మేం సహకరిస్తాం
- ప్రాజెక్టులను అప్పగించబోమన్న తీర్మానం.. ప్రజల విజయమని వ్యాఖ్య

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, ఫిబ్రవరి 12:

**ఏటా రెండు వేల టీఎంసీల** గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తాయని, అలా కలిసే జలాలనే వాడుకొమ్మని తమ ప్రభుత్వ హయాంలో ఏపీకి అవకాశం ఇచ్చామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. దీనివల్ల కృష్ణా జలాలను ఎక్కువగా వాడుకోవడానికి తెలంగాణకు అవకాశం దొరుకుతుందన్నది తమ ఉద్దేశమని తెలిపారు. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించబోమని అసెంబ్లీలో తీర్మానం చేయడం తెలంగాణ ప్రజల విజయమన్నారు. సోమవారం అసెంబ్లీలో ఈ అంశంపై జరిగిన చర్చలో హరీశ్‌రావు మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. “మేం నల్లగొండలో సభ మిగతా 2లో..

## ఉద్యోగ అర్హత వయసు పెంపు

- రెండేళ్లు పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు
- 46 ఏళ్లకు చేరిన వయో పరిమితి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, ఫిబ్రవరి 12:

**ప్రభుత్వ ఉద్యోగాల** అర్హత వయసును రెండేళ్లు పెంచారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు (జీవో నంబరు ఎంఎస్-30) జారీ చేశారు. ఈ నిర్ణయంతో జనరల్ కేటగిరీ అభ్యర్థుల ఉద్యోగ అర్హత వయసు 46 ఏళ్లకు పెరిగింది. రిజర్వేషన్ అభ్యర్థులకు ఆయా కేటగిరీల వారీగా గరిష్ఠ మిగతా 2లో..



## నేడు సర్కారు మేడిగడ్డ టూర్!

- సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల పర్యటన
- హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల్లో వెళ్లనున్న ప్రజాప్రతినిధులు
- ఉదయం 10.15కు బయలుదేరి.. మధ్యాహ్నం 3.30 గంటలకు చేరనున్న బృందం
- ప్రాజెక్టు పరిసరాల్లో ఏర్పాట్లు.. భారీగా బందోబస్తు
- కాళేశ్వరం ఆర్కిటెక్ట్ కేసీఆర్ మేడిగడ్డకు రావాలి: మంత్రి ఉత్తమ్

2

నిత్య నూతనంగా వెలువడుతూ..
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
సంచలన వార్తా కథనాలతో నిత్యం విశేష పాఠకాధరణ పొందుతున్న, నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా, మండలాల వారిగా, మండలాల వారిగా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెలను.
ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.
9848488596
FOCUS TV TELUGU

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
మంగళవారం 13, ఫిబ్రవరి 2024

# నేడు నల్లగొండలో కేసీఆర్ సభ

- అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి జనంలోకి
- కృష్ణానది ప్రాజెక్టుల అప్పగింతపై సమరభేరి
- ఆరు నెలల్లోగా నీటివాటా తేల్చాలని కేంద్ర, రాష్ట్రాలపై ఒత్తిడి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, ఫిబ్రవరి 12:

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తొలిసారి జనంలోకి అడుగుపెడుతున్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని మర్రిగూడ బైపాస్‌రోడ్డులోని 50 ఎకరాల స్థలంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు రైతుగర్జన పేర బీఆర్ఎస్ భారీ బహిరంగసభకు ఏర్పాట్లు చేసింది. కృష్ణానదిపై ఉన్న ఉమ్మడి ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించే విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఈ సభ ద్వారా ఎండగట్టాలని కేసీఆర్ భావిస్తున్నారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగింత విషయంలో రాష్ట్ర ప్రభు త్వం సోమవారం అసెంబ్లీలో తీర్మానం చేసిన నేపథ్యంలో కేసీఆర్ నల్లగొండ సభలో తన ప్రసంగ శైలిని మార్చే అవకాశముంది. 6 నెలల్లోగా నదీ జలాల పంపకం పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నల్లగొండ సభావేదికగా కేసీఆర్ అల్టిమేటం జారీ చేసే అవకాశాలు ఉన్నాయి.

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సభకు ప్రాధాన్యం

గత ఏడాది డిసెంబర్‌లో వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి ప్రతిపక్ష పాత్రకే పరిమితమైంది. ఇది జరిగిన కొద్ది రోజుల్లోనే పార్టీ అధినేత కేసీఆర్ తుంటి ఎముక శస్త్ర చికిత్స జరిగి విశ్రాంతి తీసుకున్నారు. పార్టీ నేతలతో నందినగర్ నివాసంలో, ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో భేటీ అయిన కేసీఆర్, ఇప్పటివరకు బహిరంగంగా జనంలోకి రాలేదు. ఈనెల 1న గజ్వేల్ ఎమ్మెల్యేగా స్పీకర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసిన కేసీఆర్ అదేరోజు తెలంగాణభవన్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలతోనూ భేటీ అయ్యారు. ప్రస్తుతం శాసనసభ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నా, కేసీఆర్ వాటికి దూరంగా ఉన్నారు. కానీ నల్లగొండ సభలో కేసీఆర్ చేసే ప్రసంగంపై ఆసక్తి నెలకొంది. ఈ సభ ద్వారా లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని పరోక్షంగా ప్రారంభించినట్లేనని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

తెలంగాణభవన్ నుంచి నల్లగొండ సభకు

పార్టీ ముఖ్య నేతలు తెలంగాణభవన్ నుంచి బయలుదేరేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితరులతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు నల్లగొండ సభకు హాజరవుతారు. కేటీఆర్ నేతృత్వంలో నేతలందరూ ప్రత్యేక బస్సుల్లో నల్లగొండకు వెళతారు. కేసీఆర్ మాత్రం హెలికాప్టర్ ద్వారా నల్లగొండకు చేరుకొని, సభ అనంతరం తిరిగి వాయుమార్గాన హైదరాబాద్‌కు చేరుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం మేడిగడ్డ సందర్శనకు ఏర్పాటు చేసిన నేపథ్యంలో నల్లగొండసభకు కీలక నేతలు హాజరు కావడం ద్వారా ప్రభుత్వ వాదనను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

# ఉద్యోగ అర్హత వయసు పెంపు

(మొదటి పేజీ తరువాయి..)

అర్హత వయసు అమలు పరచనున్నారు. గ్రూపు-1 పోస్టులకు సంబంధించిన పరీక్ష రద్దు, తిరిగి నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దాంతో అభ్యర్థులు అర్హత వయసును రెండేళ్లు పెంచుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంతకుముందు ప్రకటించారు. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 34 ఏళ్లుగా ఉన్న ఉద్యోగాలకు గరిష్ఠ అర్హత వయసును గత ప్రభుత్వం పదేళ్లు పెంచింది. ఈ మేరకు 2022 మార్చి 19న (జీవో నంబరు ఎంఎస్-42) ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఉత్తర్వుల ప్రకారం మరో రెండేళ్లు పెరిగింది. దాంతో మొత్తం 12 ఏళ్లు పెరిగినట్టు అయింది. రిజర్వేషన్ అమలయ్యే కేటగిరీ అభ్యర్థులకు ఈ గరిష్ఠ వయసు విషయంలోనూ కొంత వెసులుబాటు ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 ఏళ్లు, ఎక్స్ సర్వీసమెన్, ఎన్‌సీసీ అభ్యర్థులకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల పాటు సడలింపు ఉంది. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన రెండేళ్ల పెంపుతో గరిష్ఠ అర్హత వయసు ప్రభుత్వ ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 51 ఏళ్లు, ఎక్స్ సర్వీసమెన్, ఎన్‌సీసీ అభ్యర్థులకు 49 ఏళ్లు, దివ్యాంగులకు 56 ఏళ్లు అయింది. అయితే ఈ పెంపు నిర్ణయం యూనిఫాం ఉద్యోగాలకు వర్తించదు.

అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల తుది కీ విడుదల

మునిసిపల్ శాఖలోని అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు, గ్రౌండ్ వాటర్ విభాగంలోని గెజిటెడ్ అధికారుల పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల తుది కీని విడుదల చేశారు. దీన్ని టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చినట్టు అధికారులు ప్రకటించారు. సమాంతర మహిళా రిజర్వేషన్ అమలుకు వివరాల సేకరణ ప్రభుత్వం నిర్ణయించిన మేరకు సమాంతర మహిళా రిజర్వేషన్ అమలుకు అధికారులు చర్యలు చేపట్టారు. రోస్టర్ పాయింట్లలో మార్పు లేకుండా ఈ రిజర్వేషన్ అమలు చేయనున్నారు. ఆయా పోస్టుల వివరాలు ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ అధికారులు అన్ని విభాగాలకు లేఖ రాశారు.

# తెలంగాణలో నలుగురు ఐఏఎస్, 12 మంది ఐపీఎస్‌ల బదిలీ..

(మొదటి పేజీ తరువాయి..)

బాజ్‌పాయ్‌ను తదుపరి పోస్టింగ్‌కు సాధారణ పరిపాలన శాఖను రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

**రాచకొండ సీపీగా తరుణ్‌జోషి..**

రాచకొండ పోలీస్ కమిషనరేట్ సీపీగా మల్టీజోన్-2 ఐజీగా ఉన్న డా.తరుణ్‌జోషి నియమితులయ్యారు.రాచకొండ సీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సుదీర్‌బాబును మల్టీజోన్-2 ఐజీగా నియమించారు. మల్టీజోన్-1 ఐజీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు.

# తెలంగాణలో పలుచోట్ల వర్షాలు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,ఫిబ్రవరి12:

తెలంగాణ రాష్ట్రంలో ఓమోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ నిపుణులు తెలిపారు. ఆదివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షం పడిందని చెప్పారు. అదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో వర్షం పడిందని తెలిపారు. అందుకే ఉష్ణోగ్రతలు తగ్గుమొఖం పట్టాయని చెప్పారు. ఫిబ్రవరి 16 నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతాయని అంచనా వేశారు. మరో వైపు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉన్నాయి. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ఎ÷-లానింగ్ సొసైటీ డేటా ప్రకారం చాలా ప్రాంతాలు 33 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉన్నాయి. అయితే, కొన్ని ప్రాంతాల్లో 34 డిగ్రీల సెల్సియస్‌ను అధిగమించిన ఎండ ప్రభావితం చూపలేక పోయింది.

# జీవో 46పై నిర్ణయం తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి..)

నెం.46 రద్దు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. అసెంబ్లీలో చర్చించి కేబినెట్ సబ్‌కమిటీతో కొత్త నోటిఫికేషన్లలో జీవో రద్దుపై నిర్ణయం తీసుకుంటామని సీఎం వెల్లడించారు. జనాభా ప్రాతిపదికన జిల్లాల వారీ పోస్టులకు సంబంధించిన జీవో ఇది. 2022 ఏప్రిల్ 4న ఈ ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లాల వారీగా ఉండే 9 శాఖల పోస్టులను ఇందులో చేర్చారు. కానిస్టేబుల్ పోస్టులు కూడా ఈ జీవో కిందే భర్తీ చేయాల్సి వచ్చింది. దీంతో ఆ పరీక్ష రాసిన అభ్యర్థులు ఈ జీవో అంశాన్ని తెరమీదకు తెచ్చారు. జనాభా ప్రాతిపదికన తీసుకుంటుండడం, హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల పరిధిలోనే ఎక్కువ జనాభా ఉండడంతో వీరికే అవకాశాలు ఎక్కువగా వస్తున్నాయని మిగతా జిల్లాల అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ జీవోను రద్దు చేసి కానిస్టేబుల్ పోస్టులను రాష్ట్రస్థాయి పోస్టులుగా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**15,750 పోస్టులకు నియామక పత్రాలు అందించడమే..**

పోలీస్ నియామక ప్రక్రియ పూర్తయిన 15,750 పోస్టులకు నియామక పత్రాలు అందించడం తప్ప వేరే మార్గం లేదని అడ్వకేట్ జనరల్ అధికారులు తేల్చి చెప్పారు. "మార్చి 2022లో పోలీసు నియామకాలకు గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అక్టోబర్ 4, 2023 నాటికి 15,750 పోస్టులకు నియామక ప్రక్రియ పూర్తయినా.. కోర్టు కేసుతో ప్రక్రియ పెండింగ్ లో పడింది"అని అధికారులు తెలిపారు. అయితే సెలక్షన్ ప్రాసెస్ పూర్తయిన పోస్టులకు నియామక పత్రాలు అందించాలని ఇటీవల హైకోర్టు తీర్పునిచ్చిన విషయాన్ని సీఎం దృష్టికి అధికారులు తెచ్చారు. సెలక్షన్ ప్రాసెస్ పూర్తయిన 15,750 పోస్టులకు నియామక పత్రాలు అందించడం తప్ప వేరే మార్గం లేదని అడ్వకేట్ జనరల్, అధికారులు స్పష్టం చేశారు. కొత్త నోటిఫికేషన్లకు సంబంధించి జీవో 46 రద్దు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సీఎంకు అధికారులు సూచించారు. జీఓ 46 ప్రకారం జనాభా ప్రాతిపదికన పోస్టుల కేటాయింపు ఉండడంతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోనే ఎక్కువ కానిస్టేబుల్ పోస్టులు స్థానికులకు దక్కుతున్నాయనే వాదనను కొందరు వినిపిస్తున్నారు. ఫలితంగా జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందని పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. అయితే నియామక ప్రక్రియ చివరి దశలో ఉన్నందున ఇప్పుడు జీఓ 46 ర ద్దు అసాధ్యం అన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది.

# కడలిలో కలిసేవే ఇచ్చాం..

(మొదటి పేజీ తరువాయి..)

పెట్టుకోవడం చూసే ఈ తీర్మానం చేశారు. చర్చ సందర్భంగా ప్రభుత్వం అసత్యాలు మాట్లాడింది. ట్రిబ్యునల్ పరిధిలో ఉన్న ఈ అంశాన్ని మేం కృష్ణాబోర్డుకు అప్పగించడం సాధ్యమేకాదు. కాంగ్రెస్ సర్కారు మాటలు అవాస్తవమని ప్రస్తుత అధికారి రాహుల్ బొజ్జా కేంద్రానికి రాసిన లేఖే నిదర్శనం. ఆపరేషన్ ప్రొటోకాల్ లేకుండా ఒప్పుకోబోమని మేం అధికారంలో ఉండగా చెప్పాం. రెండో అపెక్స్ సమావేశంలో నీటి వాటాను వ్యతిరేకిస్తూ లేఖ రాశాం. గత కాంగ్రెస్ ప్రభుత్వాల వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రాకు 512 టీఎంసీలు వాటాగా ఉన్నాయి. మేం ఏపీ, తెలంగాణ చెరో సగం అనే డిమాండ్ తెచ్చాం. దీనిపై అనేకసార్లు లేఖలు రాశాం. జలాల విషయంలో కేసీఆర్‌ను విమర్శించడం సరికాదు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ రాష్ట్రం లేదు. సీఎం రేవంత్‌రెడ్డికి ఆ సీటు ఉండేది కాదు. సోనియాను దేవత, బలిదేవత అన్నదెవరో ప్రజలకు తెలుసు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించబోమన్న తీర్మానాన్ని బలపరుస్తున్నాం. అయితే ప్రాజెక్టులను అప్పగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించినందుకు క్షమాపణ చెప్పాలి. ప్రాజెక్టుల విషయంలో మంత్రి ఉత్తమ్ మాటలన్నీ ఉత్తవే. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రాజెక్టులను అప్పగించలేదు. మీరు రెండు నెలల్లో అప్పగించారు. పైగా నాటి ప్రభుత్వం ఒప్పుకుందని అవాస్తవాలు చెప్తున్నారు.

ఒప్పుకున్నది మీరే..

ఈ ఏడాది జనవరిలో జరిగిన మీటింగ్ మినిట్స్ ప్రకారం.. "ఏపీ, తెలంగాణ చర్చల తర్వాత శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను ఏడు రోజుల్లో అప్పగిస్తామనే ప్లాన్‌తో మీ ముందుకు వస్తాం. నెల రోజుల్లో ప్రాజెక్టులను అప్పగిస్తాం. సాగర్ డ్యాం వద్దకు వెళ్లాలంటే కృష్ణాబోర్డు అనుమతి కావాలి. బోర్డుకు ఇరు రాష్ట్రాలు డబ్బులు ఇస్తాయి.." అని కాంగ్రెస్ సర్కారు పేర్కొంది. దీనిపై పత్రికల్లో వార్తలు కూడా వచ్చాయి. అప్పుడెందుకు నోరు మెదపలేదు. నేను ప్రెస్‌మీట్ పెట్టి నిలదీశాకే.. మీరు కేంద్రానికి లేఖ రాశారు. మళ్లీ ఫిబ్రవరి 1న జరిగిన మీటింగ్‌లో ప్రాజెక్టులను బోర్డుకు అప్పగిస్తామని చెప్పారు. మ్యాన్ పవర్ అవసరం గురించి చర్చించారు. ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు అంగీకరించారు. అంటే.. కాంగ్రెస్ సర్కారే ఒప్పుకున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఈ రెండు మీటింగ్‌లలో తెలియకుండా ఒప్పుకొన్నామని శాసనసభకు క్షమాపణ చెప్పండి.

పోరాడండి.. సహకరిస్తాం

మొన్న బడ్జెట్ ప్రవేశపెట్టారు. దాని మీద చర్చ లేదు. కృష్ణా ప్రాజెక్టులపై రెండు రోజులైనా చర్చపెడదామన్నారు. ఇప్పుడు మైకులు ఇవ్వడం లేదు. 2014 జూలై 14న కృష్ణా జలాలను పునఃపంపిణీ చేయాలని కేంద్రాన్ని కేసీఆర్ అడిగారు. నదీ జలాల చట్టం ప్రకారం ఏడాది గడిచాక.. ట్రిబ్యునల్ వేయాలంటూ సుప్రీంకోర్టుకు వెళ్లాం. తర్వాత కేసు వాపస్ తీసుకుని, సెక్షన్ 3 కింద ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. మేం 9 ఏళ్లు కష్టపడితే ట్రిబ్యునల్ వచ్చింది. మీరు పోరాటం చేయండి. మేం సహకరిస్తాం. ట్రిబ్యునల్‌కు సమయం పెడదాం. 6 నెలల్లో ప్రాజెక్టుల వారీగా నీళ్లు కేటాయించాలని అడుగుదాం.

పోతిరెడ్డిపాడుపై అప్పుడు మాట్లాడలేదేం?

మేం సముద్రంలో కలిసే గోదావరి జలాలను వినియోగించుకునేందుకు ఏపీకి అవకాశం ఇచ్చామేగానీ.. కృష్ణా జలాల గురించి చెప్పలేదు. రాయలసీమ లిఫ్ట్ గురించి 2020 మే 5న జీఓ వచ్చింది. అంతకుముందే 2020 జనవరి 29నే మేం కేంద్రానికి ఫిర్యాదు చేశాం. ఆ ప్రాజెక్టును ఆపాలంటూ మే 12న లేఖ రాశాం. అపెక్స్ కమిటీ మీటింగ్‌లలో కూడా కోరాం. కాంగ్రెస్ సర్కారు అవాస్తవాలు చెప్తోంది. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచినప్పుడు మేం పేగులు తెగేదాకా కొట్లాడాం. అప్పుడు మీరెందుకు మాట్లాడలేదు?.." అని హరీశ్‌రావు నిలదీశారు.

## నేడు సర్కారు
# మేడిగడ్డ టూర్!

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, ఫిబ్రవరి 12:

రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు నేడు(మంగళవారం) కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. ఈ మేరకు సర్కారు ఏర్పాట్లు చేసింది. గత ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టు లోపభూయిష్టమని.. ఈ విషయాన్ని చూపేందుకు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను మేడిగడ్డకు తీసుకెళతామని నాలుగు రోజుల కింద సీఎం రేవంత్ అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం ఉదయం 10.15 గంటలకు సీఎం రేవంత్‌తోపాటు మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎంపీలు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల్లో మేడిగడ్డ బ్యారేజీ వద్దకు వెళ్లనున్నారు. సీఎం, మంత్రులు వస్తున్న నేపథ్యంలో.. బ్యారేజీ పరిసర ప్రాంతాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధుల పర్యటన సందర్భంగా మేడిగడ్డ వద్ద అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. బ్యారేజీని పరిశీలించేందుకు వీలుగా.. బ్యారేజీ దిగువన, గోదావరి తీరానికి వెళ్లే మార్గాలను సిద్ధం చేస్తున్నారు. వ్యూపాయింట్ ప్రాంగణం వద్ద 3 వేల మంది కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారేజీ నిర్మాణ లోపాలు, ఇతర అంశాలపై ఇక్కడ సభ నిర్వహించి, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది.

మేడిగడ్డ టూర్ షెడ్యూల్ ఇలా..

సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు మంగళవారం ఉదయం 10.15 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి బయలుదేరుతారు. మధ్యాహ్నం మూడున్నర గంటల కల్లా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీ వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 6 గంటల వరకు బ్యారేజీని పరిశీలించి, నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం సీఎం రేవంత్, మంత్రులు మీడియాతో మాట్లాడుతారు. రాత్రి 7 గంటలకు మేడిగడ్డ నుంచి తిరుగు ప్రయాణం అవుతారు.

కేసీఆర్ మేడిగడ్డకు రావాలి: ఉత్తమ్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాత (ఆర్కిటెక్ట్) కేసీఆర్ మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు రావాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కృష్ణా ప్రాజెక్టులు, బోర్డుకు అప్పగింత అంశంపై అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానాన్ని (బీఆర్ఎస్ మద్దతుతో) ఆమోదించిన విషయాన్ని గమనించాలని కోరారు. సోమవారం అసెంబ్లీ వాయిదాపడ్డాక లాబీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ సమావేశం మొదలవుతుందని.. మేడిగడ్డ పర్యటన నిమిత్తం సభను వాయిదా వేసి, బయలుదేరుతామని వివరించారు.

# ప్రభుత్వం సంచలన నిర్ణయం

- హుక్కా కేంద్రాలను నిషేధిస్తూ చట్టం
- పొగాకు ఉత్పత్తుల ప్రచారంపైనా రాష్ట్రం నిషేధం
- ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనసభ

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి12:

తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. హుక్కాపై నిషేధం విధించింది. తెలంగాణలో హుక్కా కేంద్రాలను నిషేదించే సవరణ బిల్లును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున మంత్రి శ్రీధర్ బాబు బిల్లు ప్రవేశ పెట్టగా సభ ఆమోదించింది. బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినందుకు సభకు మంత్రి శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి యువతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సిగరెట్ పొగ కంటే హుక్కా మరింత హానికరమని చెప్పారు. యువతకు హుక్కా వ్యసనమయ్యే అవకాశం ఉందన్నారు. హుక్కా అనేది సిగరెట్లతో పోల్చితే వెయ్యి రెట్లు హానికరం. ఒక సిగరెట్‌తో పోల్చితే, ఒక హుక్కా సెషన్‌లో దాదాపు 125 రెట్లు పొగ, 25 రెట్లు తారు , 2.5 రెట్లు నికోటిన్, 10 రెట్లు కార్బన్ మోనాక్సైడ్ విడుదలవుతుంది. ఒక్కసారి హుక్కాకు అలవాటు అయితే.. యువత దానికి బానిసలవుతారు. ఈ పోకడ ఇటీవల కాలంలో బాగా పెరిగింది. ఈ క్రమంలోనే తెలంగాణలోని యువత, ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ సర్కార్ హుక్కాను.. హుక్కా సెంటర్లను శాశ్వతంగా బ్యాన్ చేస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసింది. హుక్కా నిషేధం బిల్లుపై సభలో ఎలాంటి చర్చ లేకుండానే అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఈ బిల్లు రాకతో.. ఇక నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హుక్కా సెంటర్లు క్లోజ్ అవ్వనున్నాయి. హుక్కా నిషేధం వెంటనే అమల్లోకి వస్తుంది. హుక్కాకు సంబంధించిన ఉత్పత్తులను కూడా అమ్మటం, కొనటం నేరంగా పరిగణించబడుతుంది. నాలుగోరోజు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాక కీలక బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది.తెలంగాణలో హుక్కా కేంద్రాలను నిషేధించే సవరణ బిల్లును సీఎం రేవంత్ రెడ్డి తరపున మంత్రి శ్రీధర్ బాబు బిల్లు ప్రవేశ పెట్టగా సభ ఆమోదం తెలిపింది. బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినందుకు సభకు మంత్రి శ్రీధర్ బాబు దన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ హుక్కా సెంటర్లపై నిషేదం అవసరమని అన్నారు. యువత ధూమపానానికి వ్యసనమయ్యే అవకాశం ఉందన్నారు. పొగకంటే హుక్కా మరింత హానికరమని చెప్పారు. అంతకుముందు దివగంత సభ్యులకు శాసనసభలో సంతాపం తెలిపారు. ఫిబ్రవరి 4న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనే హుక్కా నిషేధంపై నిర్ణయం తీసుకున్నా అధికారికంగా ప్రకటించలేదు. హుక్కా అనేది సిగరెట్లతో పోల్చితే వెయ్యి రెట్లు హానికరం.. ఒక్కసారి హుక్కాకు అలవాటు అయితే.. యువత బానిసలుగా మారిపోతారు. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రంలోని యువత, ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.

# కేసీఆర్ ముక్కు నేలకు రాయాలి

- అసలు ఏ మొఖం పెట్టుకుని నల్గొండకు వస్తున్నారు
- హరీష్ రావుపై మంత్రి కోమటిరెడ్డి ఫైర్



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి12:

తెలంగాణ అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు మధ్య మాటల యుద్ధం నువ్వా నేనా అన్నట్లు సాగింది. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు ప్రాజెక్టులు అప్పగింతపై సోమవారం అసెంబ్లీలో చర్చ జరిగింది. ముందుగా తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృష్ణా బేసిన్ లోని ప్రాజెక్టుల గురించి, కేఆర్ఎంబీకి వాటి అప్పగింతపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. మంత్రి పీపీటీ అయ్యాక స్పీకర్ హరీష్ రావుకు సమయం ఇచ్చారు. హరీష్ రావు మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్ పూర్తి అవాస్తవాలతో పీపీటీ ఇచ్చారన్నారు. వాస్తవాలు చెప్పాలని అన్నారు.నిజాలు చెప్పేందుకు తమకు కూడా పీపీటీ అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. స్పీకర్ అందుకు సుముఖత చూపించకపోవడం దురదృష్టకరం అని హరీష్ రావు వాపోయారు. మంగళవారం(ఫిబ్రవరి 13) రోజు తాము నల్గొండలో సభ పెడ్తున్నామనే మంత్రి ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం లేదనే ప్రకటన చేశారన్నారు. ఇది తెలంగాణ ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ విజయమని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. ఆ తర్వాత మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హరీష్‌కు చుక్కలు చూపించారు. తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డి నల్గొండ జిల్లా ప్రజలను మోసం చేశారన్నారు. అసలు ఏ మొఖం పెట్టుకుని నల్గొండకు వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.నల్గొండ ప్రజలు చెప్పుతో కొట్టినట్టు తీర్పునిచ్చారన్నారు. కాగా గత ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12 నియోజకవర్గాలకు గానూ 11 కాంగ్రెస్ పార్టీ గెలిచింది. ఇక నల్గొండ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని కేసీఆర్ మోసం చేస్తే నల్గొండ ప్రజలు భూపాల్ రెడ్డిని ఇంటికి పంపించారు.ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీలో మాట్లాడిన స్టేట్‌మెంట్ వినలేదా హరీష్ అని కోమటిరెడ్డి ఫైరయ్యారు. ఆంధ్ర సీఎం చెప్పాక కూడా తమ మీద నింద వేస్తే ఎలా అని ప్రశ్నించారు. నల్గొండ జిల్లాను మోసం చేసిన జగదీష్ రెడ్డికి ముఖం లేకనే ఇవ్వాళ సభకు రాలేదన్నారు.కృష్ణా జలాల విషయంలో కానీ, ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు విషయంలో కానీ కేసీఆర్ నల్గొండ ప్రజలను మోసం చేశారని.. ముక్కు నేలకు రాసి, నల్గొండ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశరు. ఆ తర్వాతే నల్గొండ సభకు రావాలన్నారు. అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్షమాపణలు చెప్పాలన్నారు. కేసీఆర్‌ను విమర్శించడం సరికాదన్నారు.



# సదాశివపేటలో శ్రీ మార్కండేయ జయంతోత్సవ వేడుకలు

**ఉమ్మడి మెదక్ జిల్లా (నేటిఫోకస్ న్యూస్)-భామిని రఘుపతి**

సోమవారం నాడు శివుని పరమ భక్తుడు చిరంజీవి వరప్రసాధితుడు భావన ఋషి జన్మ కర్త పద్మశాలి వంశ అఖండఖ్యాతిదనులైన శ్రీ మార్కండేయ మహర్షి జన్మదినమును పురస్కరించుకొని శ్రీ మార్కండేయ మందిరంలో మేలుకొలుపు సేవ నిత్యార్చన ఈశ్వరునికి రుద్రాభిషేకములు ధ్వజారోహణము మార్కండేయ స్వామికి రుద్రాభిషేకములు డోలారోహణము మార్కండేయ స్వామి మృత్యుంజయ హెూమము కార్యక్రమంలు నిర్వహించారు దీనితోపాటు పట్టణంలోని పద్మశాలీ మహిళలు భారీ ఎత్తున ప్రతి వీధి వీధి నుండి కలశములు ఊరేగింపుగా నిర్వహించి మార్కండేయ మందిరంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మందిరంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మార్కండేయ అష్టోత్తర శతనామ స్తోత్రము 108 పుష్పాలతో శ్రీ మార్కండేయ స్వామికి పుష్పాభిషేకం చేపట్టడం జరిగింది చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీ కార్యక్రమం నిర్వహించి అందులో ప్రథమాద్వితీయ బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సతీమణి చింత అరుణ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్ చేనేత సహకార సంఘం అధ్యక్షులు చింత ఆనంద్ కుమార్ ఈశ్వర్ మందిర్ ఆలే కమిటీ చైర్మన్ చిలవరి రవికుమార్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు మునిపల్లి విశ్వనాథం పద్మశాలి సంఘం కమిటీ సభ్యులు మరియు చేనేత సహకార సంఘం కమిటీ సభ్యులు పట్టణ పద్మశాలీలు భారీ ఎత్తున పాల్గొని శ్రీ మార్కండేయ జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు.



# ఘనంగా శ్రీ మార్కండేయ జయంతి

**హౌసింగ్ బోర్డ్ కాలనీ, మౌలాలి (నేటి ఫోకస్ న్యూస్) ఫిబ్రవరి 12**



సోమవారం శివుని పరమ భక్తుడు చిరంజీవి వరప్రసాధితుడు భావన ఋషి జన్మ కర్త పద్మశాలి వంశ అఖండఖ్యాతి ధనులైన శ్రీ మార్కండేయ మహర్షి జన్మదినమును పురస్కరించుకొని శ్రీ అఖిల భారత పద్మశాలి మ్యారేజ్ బ్యూరోస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీ పరిధిలోని మంగాపురం కాలనీ నోముల రెసిడెన్సి కాంప్లెక్స్ లోని మ్యారేజ్ బ్యూరో కార్యాలయంలో మార్కండేయ స్వామికి అసోసియేషన్ అధ్యక్షులు గుండేటి సదానందం స్వామికి పూలమాలవేసి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా అధ్యక్షురాలు పొట్ట బత్తిని పద్మావతి మ్యారేజ్ బ్యూరో సభ్యులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాన కార్యదర్శి భామిని రఘుపతి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అఖిలభారత పద్మశాలి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ విధంగానే ఘనంగా నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దుడక లక్ష్మీనారాయణ శ్రీధర్ అసోసియేషన్ మిత్రులు కాలనీ మిత్రులు పద్మశాలి కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు అనుమతులు తీసుకోవాలి: అదనపు కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్ (జి.శ్రీనివాస్ జగత్ పల్లి)**

వనపర్తి జిల్లాలో కొనసాగుతున్న ప్రైవేటు ఆసుపత్రులు, పాలి క్లినిక్ లు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్ ల నిర్వాహకులు అనుమతులు పొంది ఉండాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు విషయాలను ఆయన వెల్లడించారు. పైన పేర్కొన్న వాటికి గతంలో అనుమతులు పొంది రెన్యువల్ చేయించుకోని వారు ఉంటే వారికి వెంటనే నోటీసులు జారీ చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు నిబంధనల మేరకు అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జయచంద్ర మోహన్ పట్టణ సీఐ నాగభూషణరావు వివిధ ఆసుపత్రుల వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల గుర్తింపులో సీసీకెమెరాలు కీలకం

- కేసుల పరిష్కారంలోనూ కీలకంగా ఫుటేజి
- నిందితుల పట్టివేతలో తోడ్పడుతున్న దృశ్యాలు
- శాంతి భద్రతల పరిరక్షణలోనూ ముఖ్య భూమిక

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి12:**



శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల పాత్ర కీలకంగా మారింది. అందుకే వీటిని ఏర్పాటుప చేసేందుకు హైదరాబద్ సహా అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారు. ఇకపోతే హైదరాబాద్‌లో ఏర్పాటయిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ కార్యాలయం ద్వారా అన్ని జిల్లాలను అనుసంధానం చేస్తారు. అప్పుడు జిల్లాల్లో కూడా ఎప్పుడు ఏం జరిగినా ఇట్టే పసిగట్టే అవకాశం ఉంది. ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటవుతున్నాయి. అలాగే కొందరు ఔత్సాహికుల ద్వారా కూడా ఏర్పాటు చేయిస్తున్నారు. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ బాగా పనికి వస్తోంది. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో అవి కీలకంగా మారాయి. కేసులను పసిగట్టి కూపీ లాగడంలోనూ బాగా పనికి వస్తున్నాయి. అందుకే కాలనీలు మొదలు,రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహి స్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని సిసి కెమెరాల ఏర్పాటును చేయిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని పోలీస్ అధికారులు కూడా ప్రకటించారు. ఇకపోతే నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ న్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించ గలిగారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని, దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిదిగంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదన్నారు. ఒకవేళ నేరగాళ్లను గుర్తించిన కేసుల సమయంలో సాక్ష్యులుగా వీరు ఉండలేరని, అదే సీసీ కెమేరాలైతే నిజనిర్ధారణ వేగంగా అవుతుందన్నారు. కోర్టుల్లో కూడా సీసీ కెమెరాల ద్వారా ఎటువంటి సంశయం లేకుండా శిక్షలు విధించే అవకాశాలు ఉంటాయని డీజీపీ తెలిపారు. అందుకే నగరంలో అన్ని ప్రాంతాల్లో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రాన్ని నేరరహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తున్నది. ప్రజల్లో భరోసా కల్పించేలా ముందుకు సాగుతున్నారు. ఇటీవల అనేక కేసుల పరిష్కారంలో సిసి కెమెరాల ఫుటేజీ కీలకంగా మారింది.

# రాజయ్య రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకం

- కాంగ్రెస్‌లో చేరాలన్న ఆకాంక్షపై ప్రతికూలత

**జనగామ, నేటి ఫోకస్ న్యూస్-ఫిబ్రవరి12:**





తెలంగాణ తొలి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే తాటకొండ రాజయ్య రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఆయనను గత పాపాలు వెన్నాడుతున్నాయి. కాంగ్రెస్‌లో చేరి రాజకీయంగా లబ్దిపొందాలనుకున్న ఆయనకు సొంత నియోజకవర్గంలో గతంలో మహిళలను వేధించిన వ్యవహారం వెన్నాడుతోంది. ఆయనను కాంగ్రెస్‌లోకి రానీయవద్దని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో రాజకీయంగా ఇక ఆయన చాప్టర్ క్లోజ్ అయినట్లేనని అంటున్నారు. దీంతో రాజయ్య పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. అటు కాంగ్రెస్‌లోకి వెళ్లలేక, బిఆర్ఎస్‌లో కొనసాగలేక ఇక నామమాత్రంగా ఉండే పరిస్థితులు దాపురించాయి. ఈ నెల 3వ తేదీన బీఆర్ఎస్ కు రాజీనామా చేసిన రాజయ్య.. కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధమయ్యారు. కాంగ్రెస్ లో రాజయ్య చేరికకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. గత ఏడాది డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజయ్యకు గులాబీ పార్టీ టికెట్ ఇవ్వకుండా కేటాయించారు. టికెట్‌కు బదులు రాష్ట్ర రైతుబంధు చైర్మన్ పదవి ఇచ్చారు. మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి కావడంతో రాష్ట్రంలో గులాబీ పార్టీ అధికారం కోల్పోవాల్సి వచ్చింది. టికెట్ రాకపోవడంతో తాటికొండ రాజయ్య వరంగల్ ఎంపీ కోసం ప్రయత్నాలు చేశారు. ఎంపీ టిక్కెట్ రాదని తెలుసుకున్న రాజయ్య బీఆర్ఎస్ పార్టీ, పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్ లపై ఆరోపణలు చేస్తూ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా రోజు ఏ పార్టీలో చేరుతాననే విషయాన్ని చెబుతానని రాజయ్య మీడియాతో చెప్పారు. ఇంతలో సీన్ రివర్స్ అయ్యింది. ‑ాజయ్యను కాంగ్రెస్ పార్టీలో తీసుకోవద్దని స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలోని ఆయా మండల పార్టీ అధ్యక్షులు అధిష్టానానికి విన్నవించుకున్నారు. అంతటితో ఆగకుండా రెండురోజుల క్రితం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్ లోని కాంగ్రెస్ భవన్ ఎదుట ఆందోళన చేశారు. కామాంధుడైన రాజయ్యను ఎట్టి పరిస్థితుల్లో పార్టీలోకి తీసుకురావద్దని అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహలతో రాజయ్య మంతనాలు చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి ఒకే చెప్పారు. అయితే నియోజకవర్గ కాంగ్రెస్ నేతల నుంచి వ్యతిరేకత ఎదురవడంతో పాటు వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు రాజయ్య పై విముక్త వ్యక్తం చేస్తున్నారు. అయినా రాజయ్య తన ప్రయత్నాలను ఢిల్లీ కేంద్రంగా కొనసాగించిన ఢిల్లీ పెద్దలు మొహం చాటేసినట్లు సమాచారం. దీంతో రాజయ్య రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం నుంచి తాటికొండ రాజయ్య ఎమ్మెల్యేగా గెలిచారు. తెలంగాణ ఉద్యమం ఎగిసి పడుతుండడంతోపాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరిగే పరిస్థితి లేకపోవడంతో అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తాటికొండ రాజయ్య ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉద్యమ పార్టీ టిఆర్ఎస్ లో చేరారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల తో పాటు 2014, 2018 ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నుండి గెలిచారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన మంత్రివర్గ విస్తరణలో రాజయ్య తొలి ఉపముఖ్య మంత్రి పదవి వరించింది. అయితే కొద్ది రోజులకే వివిధ ఆరోపణలు ఎత్తడంతో పార్టీ అధినేత కేసీఆర్ రాజయ్య పదవికి రాజీనామా చేయించారు. దీంతో రాజయ్య ఎమ్మెల్యేకే పరిమితమయ్యారు. రాజయ్య పై సొంత పార్టీకి చెందిన మహిళ లైంగిక ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి వరంగ్ల లోక్‌సభకు పోటీచేయాలనుకున్నా పరిస్థితి ప్రతికూలంగా మారింది.



# రైతులు భూసార పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలి

- వెల్టూర్‌లో జాతీయ సేవా పథకం పనులు ప్రారంభం
- ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పిడిగం సైదయ్య

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్ (జి. శ్రీనివాస్ జగత్ పల్లి):**

వ్యవసాయం చేసే రైతులు భూసార పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పిడిగం సైదయ్య అన్నారు. మండలంలోని వెల్టూర్ గ్రామంలో జాతీయ సేవా పథకం శిబిరం (యూనిట్ -2) ప్రోగ్రాం అధికారి డాక్టర్ విద్య అధ్యక్షతన సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ పిడిగం సైదయ్యతో పాటు తహసిల్దార్ కిషన్ నాయక్ లు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరం విశిష్టతను వివరించారు. సోమవారం నుంచి ఈ నెల 18 వరకు నిర్వహించే శిబిరంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ విద్య తెలిపారు. మొదటిరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తహసిల్దార్ కిషన్ తెలిపారు. అలాగే అసోసియేట్ డీన్ పిడిగం సైదయ్య మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాలలో నేలల సారవంతాన్ని తెలుసుకునేందుకు భూసార పరీక్షలు చేయించుకోవాలని వాటి వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరం ఉంటుందని అన్నారు. నేడు జరిగే కార్యక్రమంలో పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్, సేంద్రీయ వ్యవసాయ విధానం వంటివి విశదపరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఎంపీటీసీ రామచంద్రయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



# భూపాలపల్లి జిల్లాలో విషాదం

- విద్యుదాఘాతంతో కానిస్టేబుల్ మృతి

**జయశంకర్ భూపాలపల్లి, నేటి ఫోకస్ న్యూస్-ఫిబ్రవరి12:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విషాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతంతో ఓ కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కలకలం రేపింది. కాగా..వణ్య ప్రాణాల కోసం ఏర్పాటు చేసిన కరెంట్ వైర్లు తగిలి విధి నిర్వహణలో ఉండగానే కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన కాటారం మండల పరిధిలోని నస్తూర్‌పల్లిలో చోటుచేసుకుంది. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఏం జరిగిందో తెలుసుకోవాలని పై అధికారులకు విచారణ ఆదేశించారు. కరెంట్ తీగలు ఎవరు అమర్చారో తెలుసుకునే పనిలో దర్యాప్తు చేస్తున్నారు.నస్తూర్‌పల్లి అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందింది. కానిస్టేబుల్ ప్రవీణ్ మరికొందరు సిబ్బందితో కలిసి అడవిలో కూబింగ్ కు వెళ్లాడు. ఈ క్రమంలో వన్యప్రాణులను వేటాడేందుకు ఏర్పాటు చేసిన కరెంట్ వైర్లు తగిలి ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి కరెంట్ షాక్ ట్రాప్ వేసిన నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. కానిస్టేబుల్ మృతి విషయం తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు పోవడం విచారకరమని తెలిపారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కరెంట్ వైర్లు వేసిన దుండగులను పట్టుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ ఆదేశించారు.

# తెలంగాణ ఆబ్కారీ, పంచాయతీరాజ్ శాఖల్లో భారీ బదిలీలు

**హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఫిబ్రవరి12:**

తెలంగాణలో ఎన్నికల బదిలీలు కొనసాగుతున్నాయి. ఆబ్కారీశాఖలో 14 మంది ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఇద్దరు ఉప కమిషనర్లు, 9 మంది సహాయ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆబ్కారీశాఖనూ బదిలీల జాబితాలో చేర్చారు. దీంతో గడిచిన నాలుగేళ్ల కాలంలో మూడేళ్లుగా ఒకే రెవెన్యూ జిల్లాలో పనిచేస్తున్న వారికి ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా స్థానచలనం కల్పించారు. అలాగే పంచాయతీరాజ్ శాఖలో 105 మంది జడ్పీ సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలు, డీఆర్డీవోలు బదిలీ అయ్యారు. ఇప్పటికే రాష్ట్రంలో 395 మంది ఎంపీడీవోలు, 132 మంది తహసీల్దార్లు, 33 మంది నాయబ్ తహసీల్దార్లు బదిలీ అయిన సంగతి తెలిసిందే.

# అత్యాచార నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

- పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో పాటు కానిస్టేబుల్‌కు ప్రశంసా పత్రాలు
- అభినందించి ప్రశంసా పత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్ (జి.శ్రీనివాస్ జగత్ పల్లి):**

ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేసిన దుండగుడికి సోమవారం వనపర్తి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జ్ సునీత 20 సంవత్సరాల ఆరు నెలల జైలు శిక్షతోపాటు రెండు వేల జరిమానా విధించారు. మదనాపురం పోలీసు స్టేషన్ పరిధిలో మచ్చన్ షేక్ (48) అనే దుండగుడు ఓ బాలికపై అత్యాచారం చేసిన కేసులో పోలీసులు అత్యాచారంతోపాటు ఫోక్సో కేసు చేశారు. కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బక్షి చంద్రశేఖర రావు కానిస్టేబుల్ మన్యంకొండ లు తగిన ఆధారాలను కోర్టు ముందు ఉంచి దుండగుడికి కేసు ప్రూఫ్ అయ్యేలా కృషి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీపీ శిఖా గోయల్ వారిని అభినందిస్తూ ప్రశంసా పత్రాలు పంపించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి వారిని తన కార్యాలయానికి పిలిచి పోలీసు శాఖ నుంచి అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు.





ఫోకస్ న్యూస్
మంగళవారం 13, ఫిబ్రవరి 2024

# షాడో ఇమేజ్ కాదు.. దమ్ముంటే నేరుగా రాయండి



**షాడో ఇమేజ్ పెట్టి కాదు..** దమ్ముంటే నా ఫొటో వేసి.. నిర్మాత ఇంట్లో మద్యం తాగాడని రాయ్.. అంటూ బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్ ఫైర్ అయ్యారు. మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన 'ఈగల్' మూవీ సక్సెస్ మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హరీష్ శంకర్ అతిథిగా హాజరయ్యారు. 'ఈగల్' సినిమాపై వస్తున్న ట్రోలింగ్ గురించి మాట్లాడుతూ.. తనపై లేనిపోని వార్తలు రాస్తున్న వారిపై ఆయన ఫైర్ అయ్యారు. మేము ఏ పొలిటికల్ అజెండా లేకుండా సినిమాలు తీయాలి. సినిమా అంటే ఒకటి కళాత్మకం.. రెండోది వ్యాపారం. నా సినిమా అన్ని పార్టీల వాళ్లు చూడాలని కోరుకుంటా. ఒక వర్గాన్ని దూరం చేసుకోవాలనే ఆలోచన నాకు ఎందుకు ఉంటుంది. పవన్ కళ్యాణ్ గారు కూడా నా గురించి చెప్పారు. 'మీరు సినిమా డైరెక్టర్. జనసేనకు సంబంధించి కానీ, వేరే ఇతరత్రా విషయాలలో కానీ మీరు రియాక్ట్ అవ్వాల్సిన అవసరం లేదు'ని స్టిక్ట్‌గ్రా చెప్పారు. మేము ఏ సినిమా చేస్తున్నా.. హౌస్‌ఫుల్ అవ్వాలని అనుకుంటాం. మాకు ఎటువంటి అజెండాలు ఉండవు. కార్తిక్ రెండో సినిమా చేసుకుంటున్నాడు. మేము ఉన్నాం కదా.. మా మీద సెటైర్లు వేసుకోండి. మేము రెడీ. అతనిపై సెటైర్లు ఆపండి. ఒక చిన్న లైన్ మిస్ అవుతున్నాం. క్రిటిసిజమ్‌కి, ట్రోలింగ్‌కు తేడా తెలియకుండా పోతుంది. విమర్శ వేరు.. ఎద్దేవా, ఎగతాళి వేరు. ఎవరో సోషల్ మీడియాలో ట్రోల్ చేశారంటే అర్థం ఉంది. మన రివ్యూస్ కూడా ట్రోల్ చేసేలా ఉన్నందుకు బాధేస్తుంది. నాలుగు సంవత్సరాల నుండి సినిమా లేదు.. నిర్మాత ఇంట్లో కూర్చుని తెల్లవార్లు మద్యం తాగాడు ఓ డైరెక్టర్.. ఇతను పవన్ కళ్యాణ్‌తో బ్లాక్‌బస్టర్ కొట్టాడంటే.. ఇంకెవరు? మొత్తం రాసే ధైర్యం ఉండదు.. ఒక షాడో ఇమేజ్ పెడతారు. రా.. దమ్ముంటే నా ఫొటో వేసి.. హరీష్ శంకర్ తెల్లవార్లు తాగాడు అని రాయ్. నీ కౌంటర్‌కి నేను కౌంటర్ వేస్తాను. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటకు ముందు గ్యాప్ వచ్చింది అంటుంటాడు. నేనిప్పుడు రెండు సినిమాలు చేస్తున్నా. 'ఉస్తాద్ భగత్ సింగ్', 'మిస్టర్ బచ్చన్'. అతి త్వరలో పెద్ద హీరోలతో మరో రెండు సినిమాలు ప్రకటించబోతున్నా. ఇదేమన్నా ప్రోగ్రెస్ రిపోర్టా? మా నాన్నలాగా ఫీజ్ కట్టావా.. నేను ఏం చేస్తున్నానో నీకు చూపించడానికి?. నాలుగు కాకపోతే ఐదేళ్లు కుదరదు. నీకు ప్రాబ్లమ్ ఏంటి? నీ ఇంటికి వచ్చి ఏమైనా అడుగుతున్నానా? నా రెంట్ కట్టండని. ట్రోలింగ్ మాకేం కొత్తకాదు. మేము సినిమా రంగంలోకి అడుగుపెట్టేటప్పుడే.. మా అమ్మనాన్నలే మాపై మొదట ట్రోల్ చేశారు. సినిమా పుట్టాకే వెబ్‌సైట్స్ పుట్టాయ్. వెబ్‌సైట్స్ పుట్టాక సినిమా పుట్టలేదు. అన్నిటికి తెగించి.. ఎన్నో సౌకర్యాలు, సుఖాలు త్యజించి ఇక్కడకొచ్చి నిలబడ్డాం. అందరినీ అనడం లేదు. మళ్లీ అందరూ భుజాలు తడుముకోకండి. అని హరీష్ శంకర్ సీరియస్ అయ్యారు.

# మహేశ్ సరసన ఇండోనేషియా బ్యూటీ

**మహేష్‌బాబు,** ఎస్ఎస్.రాజమౌళి కాంబోలో 'ఎస్ఎస్ఎంబీ 29' సినిమా ప్రకటించినప్పటి భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ఇంకా ప్రారంభం కాలేదు కానీ సినిమాపై రకరకాల వార్తలు పుట్టుకొస్తున్నాయి. సినిమా కథ నుంచి నటీనటుల వరకూ ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. తాజాగా మరో వార్త నెట్టింట షికారు చేస్తోంది. ఈ చిత్రం హీరోయిన్ ఎవరనే అంశం ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉంది. పాన్ వరల్డ్ స్థాయిలో ఈ సినిమాని తెరకెక్కించనున్న రాజమౌళి.. దానికి తగ్గట్లు విదేశీ నటులనూ ఎంపిక చేసుకునే ఆలోచనలో ఉన్నారని టాక్. ఈ మేరకు ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ ఇందులో హీరోయిన్‌గా నటించే అవకాశాలున్నాయనే వార్త వైరల్ అవుతోంది. చెల్సియా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో రాజమౌళిని ఫాలో అవుతుండడంతో ఆ వార్తలకు బలం చేకూరినట్లైంది. ఇంతకుముందు బాలీవుడ్ హీరోయిన్ ఒకరు మహేశ్ సరసన నటించే ఛాన్స ఉందంటూ గాసిప్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో ఎంత నిజం ఉందనేది తెలియాలంటే జక్కన్న నోరు విప్పాల్సిందే! ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మార్చి చివర్లో లేదా ఏప్రిల్‌లో ఈ చిత్రం సెట్స్ మీదకెళ్లనుందని తెలుస్తోంది. చెల్సియా గురించి చెప్పాలంటే ఆమె జకార్తాలో చదువు పూర్తి చేసి 2013లో హాలీవుడ్ ఫిల్మ్ 'రిరెన్'తో వెండితెరకు పరిచయం అయింది. తర్వాత 'స్ట్రీట్ సొసైటీ', 'హెడ్‌షాట్', 'మే ది డెవిల్ టేక్ యు' తదితర సినిమాలతో మంచి గుర్తింపు పొందింది. మరోవైపు, మార్వెల్ సినిమాలతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం క్రిస్ హెమ్స్‌వర్త్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించనున్నారని కథనాలు వస్తున్నాయి. వీటిలో నిజమెంతో తెలియాలంటే అధికారిక ప్రకటన వెలువడాల్సిందే.



# మళ్లీ మేకప్ వేసుకోనున్న సమంత



**మయోసైటిస్** అనారోగ్య కారణంతో సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చిన అగ్ర కథానాయిక సమంత మళ్లీ చురకుగా నటనకు రాబోతోంది . తను అంగీకరించిన చిత్రాలు, సిరీస్‌లు పూర్తి చేసి ప్రస్తుతం రెస్ట్‌లో ఉంది. ఈ గ్యాప్‌లో విదేశాల్లో చికిత్స పొందింది సామ్. తాజాగా సమంత నుంచి అభిమానులకు తీపి కబురు అందింది. సమంత బ్యాక్ టు వర్క్ అని సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్ అవుతోంది. త్వరలో మళ్లీ షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు అభిమానులకు తీపి కబురు వినిపించింది. గతేడాది 'శాకుంతలం', 'ఖుషి' చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన సమంత 'సిటాడెల్' చిత్రీకరణ తర్వాత సినిమాల నుంచి విరామం తీసుకుంది. తాజాగా సినిమా చిత్రీకరణను మొదలు పెడుతున్నట్లు తెలుపుతూ ఇన్స్టా వేదికగా ఓ 'ఇప్పటికే చాలా మంది ఎప్పుడు షూటింగ్ సెట్‌లో కనిపిస్తారని అడుగుతున్నారు. ఇప్పుడు ఆ టైమ్ రానే వచ్చింది. 'నేను త్వరలో మళ్లీ నా పనిని ప్రారంభించ బోతున్నాను. కొన్ని రోజులుగా నేను ఒక నిరుద్యోగిగా ఖాళీగా ఉన్నాను. ఇటీవల నేనునా స్నేహితులు కలిసి హెల్త్ పాడ్‌కాస్ట్‌పై ఓ కార్యక్రమం చేశాం. త్వరలో దాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు సమంత. అయితే సమంత తదుపరి చిత్రాలు ఏంటనే విషయంపై ఎలాంటి క్లారిటీ లేదు. తను నటించిన సిటాడెల్ సిరీస్ విడుదలకు సిద్ధమవుతోంది. రాజ్ అండ్ డీకే ఈ సిరీస్‌కు దర్శకులు.

# విశ్వంభర కోసం రామోజీలో సెట్



మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'విశ్వంభర'. పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష దాదాపు 18 ఏండ్ల తర్వాత చిరంజీవితో కలిసి ఇందులో నటిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ షూటింగ్ సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాలోని ఓ స్పెషల్ యాక్షన్ సీక్వెన్స్ కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్‌ను వేస్తున్నట్లు సమాచారం. ఇక ఈ సెట్‌లో మెగాస్టార్‌తో పాటు విలన్స్‌పై భారీ యాక్షన్ సీన్స్ ను షూట్ చేయనున్నట్లు టాక్. అయితే ఈ సీక్వెన్స్‌లో చిరంజీవి గెటప్ చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుందని యాక్షన్ విజువల్స్‌గా కూడా గూస్‌బంప్స్ తెప్పిస్తాయని తెలుస్తుంది. ఇక ఇదే గనుక నిజం అయితే మెగా ఫ్యాన్స్‌కు చాలా రోజుల తర్వాత ఫుల్ మీల్స్ అని చెప్పాలి. ఇక ఈ మూవీ సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ మూవీ తెరకెక్కుతుండగా యువీ క్రియేషన్స్ సంస్థ సుమారు రూ. 200 కోట్లతో బ్జడెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తుంది. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా ఈ చిత్రాన్ని 2025 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.